

సాగర్ సొసైటీ పర్యటనలో కార్పొరేటర్ వెంకటేశ్

తాగునీటి సమస్యలను పరిష్కరిస్తాం

● కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్

బంజారాహిల్స్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన ప్రాంతాల్లో నూతనంగా పైప్‌లైన్‌లు వేస్తామని జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ అన్నారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 2 సాగర్ సొసైటీలో ఆయన మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా తాగునీరు, డ్రైనేజీ సమస్యలపై స్థానికులు ఫిర్యాదు చేశారు. స్పందించిన కార్పొరేటర్ తాగునీటి పైప్‌లైన్లకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని, త్వరలోనే నిధులు మంజూరు అవుతాయన్నారు. తాత్కాలిక పరిష్కారం కోసం ట్యాంకర్లను పంపించాలని జలమండలి జీఎం హరిశంకర్‌కు ఫోన్‌లో సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



డా. చిన్నారెడ్డిని సన్మానిస్తున్న కానిస్టేబుల్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు

త్వరగా విధుల్లోకి తీసుకోండి

● చిన్నారెడ్డికి కానిస్టేబుల్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల విజ్ఞప్తి

బేగంపేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియను త్వరలో ప్రారంభించనున్నట్లు పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ వెల్లడించారని ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా. చిన్నారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ప్రజాభవన్‌కు వచ్చిన 2018 బ్యాచ్ స్పెషల్ పోలీస్ కానిస్టేబుల్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు చిన్నారెడ్డిని కలిసి త్వరగా విధుల్లోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన చిన్నారెడ్డి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. త్వరలో నియామక ప్రక్రియ ప్రారంభిస్తామని చెప్పారని చిన్నారెడ్డి వారికి వివరించారు. దీంతో అభ్యర్థులు సంతోషం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి ఫొటో ఫ్రేమ్‌ను అందజేశారు.

ప్రజావాణికి 368 అర్జీలు

ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణికి 368 అర్జీలు వచ్చాయి. ప్రజావాణి ఇన్‌చార్జి చిన్నారెడ్డి, నోడల్ అధికారి దివ్య ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధికి 76, విద్యుత్‌కు 30, రెవెన్యూకు 70, ఇందిరమ్మ ఇళ్లకు 110, ఇతర శాఖలకు 54 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు.



స్థానికులతో కలిసి మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ లక్ష్మి

ఇంటికో చెట్టును పెంచాలి

● కార్పొరేటర్ కొలను లక్ష్మి

బేగంపేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఇంటికో చెట్టును పెంచి కాలుష్య రహిత వాతావరణానికి తోడ్పడాలని సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మి ప్రజలను కోరారు. సనత్‌నగర్ డివిజన్ జెక్ కాలనీలో ఎస్‌వీఎస్‌ఎస్ నివాస్ వారి సౌజన్యంతో కార్పొరేటర్ లక్ష్మి మంగళవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చెట్టు నీడను ఇవ్వడంతో పాటు మనిషికి ఆక్సిజన్‌ను అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎస్‌వీఎస్‌ఎస్ నివాస్ ప్రెసిడెంట్ సురేష్ చౌదరిని ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో అపార్ట్‌మెంట్ జనరల్ సెక్రటరీ తిరుపతిరెడ్డి, కోశాధికారి సంపత్, జెక్ కాలనీ అధ్యక్షుడు డా. మల్లు ప్రసాద్, వెంకట్ చందు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని వినతి

బేగంపేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని నగర ముఖ్య ప్రణాళికాధికారిని కలిసి దళిత చైతన్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముప్పిడి నవీన్‌కుమార్ మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం నవీన్‌కుమార్ మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీలో పనిచేస్తున్న చైన్‌మెన్‌లు చాలా సంవత్సరాలుగా బదిలీ లేకుండా ఒకే ప్రాంతంలో ఉండి అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. ప్రధానంగా బేగంపేట, సికింద్రాబాద్ సర్కిళ్ల పరిధిలో ఎక్కడ చూసినా అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయన్నారు. అక్రమాలపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేయగా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.



వినతిపత్రం అందజేస్తున్న ముప్పిడి నవీన్‌కుమార్

వేగంగా రేషన్ కార్డుల జారీ ప్రక్రియ

● మార్పుచేర్పులను వేగవంతం చేసిన అధికారులు
● క్షేత్రస్థాయిలో విచారణ చేస్తున్న సిబ్బంది
● కొత్తగా పెళ్లైన జంటలకు త్వరలో కార్డులు అందే అవకాశం



ఖైరతాబాద్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్ కార్డు కావాలంటే పాత కార్డులో ఉన్న వారి పేర్లు తొలగించాలన్న కొత్తగా పెళ్లైన అనేక మంది ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ క్రమంలో పేర్ల తొలగింపునకు దరఖాస్తు చేసుకోగా వాటిని పరిశీలించిన అధికారులు ఆ ప్రక్రియను దాదాపు పూర్తి చేశారు. ఖైరతాబాద్ సర్కిల్‌లో ఇప్పటివరకు పాత రేషన్ కార్డుల నుంచి 4,315 పేర్లను తొలగించినట్లు అధికారులు వెల్లడించారు. ఇక కొత్త రేషన్‌కార్డుల జారీ ప్రక్రియతో పాటు పాత కార్డుల్లో కొత్త వారి పేర్లు చేర్చే ప్రక్రియ పౌర సరఫరాల శాఖ ఖైరతాబాద్ సర్కిల్ (7)లో వేగంగా జరుగుతోంది. సివిల్ సప్లై ఇన్‌స్పెక్టర్లు క్షేత్రస్థాయిలో విచారణ చూస్తూ కొత్త కార్డుల జారీ కోసం అర్హులను గుర్తిస్తున్నారు.

పెండింగ్ దరఖాస్తులకు తొలి ప్రాధాన్యత

కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులను తీసుకునే ప్రక్రియ చాలా సంవత్సరాల క్రితం నిలిచిపోయింది. గత ప్రభుత్వ హయాంలోనే రేషన్‌కార్డుల్లో పేర్లను చేర్చడం, కొత్త కార్డులను మంజూరు చేయడం నిలిపివేయడంతో ఆశావహులు సంవత్సరాల తరబడి ఎదురు చూడాల్సి వచ్చింది. ఎన్నికల హామీ మేరకు ప్రస్తుత ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులను ఆహ్వానించగా ఎంతో కాలంగా ఎదురుచూసిన ప్రజలు భారీ సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. ప్రజాపాలన దరఖాస్తుల్లో భాగంగా కొత్తగా పెళ్లయిన జంటలు, పిల్లల పేర్లు చేర్చని వారు పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేసుకోగా వాటిని జీహెచ్‌ఎంసీ, విద్యాశాఖకు చెందిన సిబ్బంది క్షేత్రస్థాయిలో సర్వే చేసి రిపోర్టులను పౌరసరఫరాల శాఖ అధికారులకు అందజేశారు. ప్రస్తుతం దరఖాస్తుల తుది పరిశీలన జరుగుతోంది. మొదట చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయాలనే ఆదేశాల మేరకు గత ప్రభుత్వ హయాంలో వచ్చిన దరఖాస్తులను తొలి ప్రాధాన్యత క్రమంలో పరిశీలిస్తున్నారు. పాత దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా కొత్తగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడం సాధ్యపడకపోవడం వల్ల చాలా మంది ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ వాటిని పరిశీలించి మంజూరైనా చేయాలి లేకుంటే తిరస్కరించాలని కోరుతుండడంతో వాటిని పరిశీస్తున్నామని అధికారులు తెలిపారు.

అన్ని దరఖాస్తులను పరిశీలిస్తున్నాం

రేషన్ కార్డులు లేని వారికి కార్డులు అందజేసే ప్రక్రియ నిరంతరాయంగా జరుగుతుందని ఖైరతాబాద్ ఏసీఎస్‌ఓ జ్యోతి రాథోడ్ పేర్కొన్నారు. పాత దరఖాస్తులు ఏమయ్యాయని, ప్రజా పాలన దరఖాస్తుల్లో తమకు కార్డులు మంజూరయ్యాయా లేదా అనే విషయమై చాలా మంది కార్యాలయానికి వచ్చి విచారిస్తున్నట్లు తెలిపారు. పాత కార్డుల్లో ఉన్న పేర్లను తొలగించాలని చేసుకున్న దరఖాస్తుల పరిశీలన పూర్తికాగా 4,315 పేర్లను తొలగించామని, ప్రస్తుతం కొత్త వారి పేర్లు చేర్చే ప్రక్రియ వేగంగా నడుస్తోందన్నారు. కొత్తగా దరఖాస్తు చేయాలనుకునేవారు మీసేవ కేంద్రాల్లో చేసుకోవచ్చని, పాత కార్డుల్లో పేర్లు తొలగించాలంటే కుటుంబ పెద్ద ఏసీఎస్‌ఓకు లేఖ రాసి దానికి ఆధార్ కార్డులను, రేషన్ కార్డు నకలును జత చేయాలని సూచించారు. కొత్త రేషన్‌కార్డులకు అర్హత ఉండాలంటే ఏడాదికి రూ.2లక్షల లోపు ఆదాయం ఉండాలని, ఎల్‌పీజీ గ్యాస్ కనెక్షన్ పత్రం ఇవ్వాలన్నారు. కుటుంబ సభ్యులకు కారు ఉన్నా, 3 ఎకరాల కంటే ఎక్కువ తడి పొలం, 7 ఎకరాల కంటే ఎక్కువ బీడు భూమి ఉన్నా, ఆదాయ పన్ను ఎక్కువ కట్టేవారు, 100 గజాల కంటే ఎక్కువ స్థలంలో ఇల్లు ఉన్న వారు అనర్హులని చెప్పారు.



గాయపడ్డ కానిస్టేబుల్ శ్రీకాంత్

బీర్ సీసాతో కానిస్టేబుల్‌పై యువకుడి దాడి

బంజారాహిల్స్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనంతో కారును ఢీ కొట్టిన యువకుడిని ప్రశ్నించిన కానిస్టేబుల్‌పై అతడు బీరు సీసాతో దాడికి పాల్పడ్డాడు. నగరానికి చెందిన శ్రీకాంత్ బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మఫ్టీలో బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12లో విధులు నిర్వహిస్తుండగా టోలిచౌకికి చెందిన కాజా అనే యువకుడు బైక్ రేసింగ్ చేసుకుంటూ వేగంగా వస్తూ ఒమెగా ఆసుపత్రి వద్ద వెనుక నుంచి ఓ కారును ఢీ కొట్టాడు. ఈ విషయంలో కారు డ్రైవర్‌తో కాజా వాగ్వాదానికి దిగాడు. ఇది చూసిన కానిస్టేబుల్ శ్రీకాంత్ అక్కడికి వెళ్లి కాజాను ప్రశ్నించాడు. దీంతో ఆగ్రహానికి గురైన కాజా అక్కడే ఉన్న బీరు బాటిల్ తీసుకొని శ్రీకాంత్ తల మీద కొట్టాడు. తీవ్ర గాయాలైన శ్రీకాంత్‌ను ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కాజాపై కేసు నమోదు చేశారు.

రాజ్యాంగ నిర్మాతలను అవమానిస్తే ఊరుకోం

● కాంగ్రెస్ నేతలు

హైదరాబాద్ సిటీ, మార్చి 25(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాతలను బీజేపీ అవమానిస్తే ఊరుకునేది లేదని పలువురు కాంగ్రెస్ నేతలు అన్నారు. మంగళవారం నాంపల్లిలోని ఇందిరాభవన్‌లో ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్ర సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్ హన్మంతరావు మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలో వచ్చిన తర్వాత కాంగ్రెస్ చేసిన ఎన్నో అభివృద్ధి పనులను తుడిచేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్రలు చేస్తున్నారని, దీన్ని తిప్పికొట్టేందుకు ప్రజలను చైతన్యవంతం చేయాలని పార్టీ కార్యకర్తలను కోరారు. ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి రాహుల్ గాంధీ జై బాపు జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం తీసుకొచ్చారన్నారు. జై సంవిధాన్ ఆశయాలకు అనుగుణంగానే రాష్ట్ర ప్రభుత్వం విధానాలను రూపొందిస్తుందని, రాష్ట్రంలో ఇప్పటికే బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ బిల్లులకు ఆమోదం తెలిపి సామాజిక న్యాయం కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి, నాంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి ఫిరోజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రతిజ్ఞ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

అపస్మారక స్థితిలోకి కారు డ్రైవర్.. కాపాడిన ట్రాఫిక్ పోలీస్

బేగంపేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): బేగంపేట ప్రధాన రహదారిలో శ్యామ్‌లాల్ బిల్డింగ్ ప్రాంతంలో మంగళవారం మధ్యాహ్నం ఒక్కసారిగా ట్రాఫిక్ జామ్ అయింది. అప్పటి వరకు సాఫీగా సాగిన ట్రాఫిక్ ఒక్కసారిగా నిలిచిపోవడంతో అటుగా వెళ్తున్న ట్రాఫిక్ పోలీస్ అశోక్‌రెడ్డి రోడ్డుపై ఆగిఉన్న కారును గమనించి అక్కడికి వెళ్లారు. డ్రైవర్ సీట్లో ఉన్న వ్యక్తి మూర్ఛ కారణంగా అపస్మారక స్థితికి చేరినట్లు గమనించి వెంటనే స్థానికుల సహాయంతో ప్రథమ చికిత్స చేశారు. అనంతరం ఆస్పత్రికి తరలించడంతో కోలుకుని డిశ్చార్జి అయ్యాడు. సకాలంలో స్పందించి వ్యక్తి ప్రాణాలు కాపాడిన ట్రాఫిక్ ఆర్‌ఎస్‌ఐ అశోక్‌రెడ్డిని నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు సన్మానించారు.

ఫోన్ హ్యాక్ చేశారని ఫిర్యాదు

బోరబండ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): వాట్సాప్ గ్రూపులో వచ్చిన లింక్‌పై క్లిక్ చేయగానే ఫోన్ హ్యాక్ అయిన ఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధురానగర్ కాలనీకి చెందిన వి.రామకృష్ణారెడ్డికి వాట్సాప్‌లో ప్రైమ్ మినిస్టర్ కిసాన్ లిస్ట్ అప్లికేషన్ వచ్చింది. ఆ లింక్‌పై క్లిక్ చేయగానే ఫోన్ బ్లాక్ అయి హ్యాకర్ల చేతుల్లోకి వెళ్లిపోయింది. దీంతో కంగారు పడిన రామకృష్ణారెడ్డి మధురానగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

బోరబండ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): స్వగ్రామానికి వెళ్లి వచ్చేసరికి ఇంటి తాళాలు పగులకొట్టి చోరీ చేసిన ఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రహ్మత్‌నగర్‌లో నివసిస్తున్న గీత ఈ నెల 7న వరంగల్ జిల్లాలోని స్వగ్రామానికి వెళ్లింది. 24న తిరిగి వచ్చిన ఆమె ఇంటి తాళాలు పగలగొట్టి ఉండటం గమనించింది. లోపలికి వెళ్లి చూడగా మొబైల్, రూ.20 వేల నగదు చోరీకి గురైనట్లు తెలిసింది. గీత ఫిర్యాదు మేరకు మధురానగర్ పోలీసులు కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మంద కృష్ణ సంతృప్తికే ఎస్సీ వర్గీకరణ

● వర్గీకరణ చట్టం న్యాయస్థానంలో నిలవదు
● సమతా సైనిక్ దళ్, మాల సంఘాల నేతలు

పంజాగుట్ట, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మంద కృష్ణమాదిగను సంతృప్తి పరిచేందుకే తెలుగు రాష్ట్రాల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తున్నారని సౌత్ ఇండియా సమతా సైనిక్ దళ్ అధ్యక్షుడు దిగంబర్ కాంబ్లీ, మాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రామ్‌ప్రసాద్ ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణ నివేదిక, రాష్ట్ర ప్రభుత్వం చేసిన చట్టం తప్పుల తడక అని వారు విమర్శించారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జస్టిస్ షమీమ్ అక్తర్ నివేదిక, అసెంబ్లీలో ఆమోదించిన ఎస్సీ వర్గీకరణ బిల్లుపై వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వర్గీకరణ చట్టం న్యాయస్థానంలో నిలవదని, వర్గీకరణ చట్టాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని వారు పేర్కొన్నారు. దళిత వ్యతిరేకి అయిన మంద కృష్ణమాదిగను సంతృప్తి పరిచేందుకు హడావిడిగా కమిషన్‌ను ఏర్పాటు చేశారని, నివేదికను బయటపెట్టకుండానే అసెంబ్లీలో ఆమోదించారన్నారు. దేశ చరిత్రలో దొంగ చట్టం చేసిన ఘనత సీఎం రేవంత్ రెడ్డికే దక్కుతుందని వారు ఎద్దేవా చేశారు.



జస్టిస్ షమీమ్ అక్తర్ నివేదిక ప్రతులను చించివేస్తున్న మాల సంఘాల నాయకులు

కాంగ్రెస్, బీజేపీలపై పోరాటం చేస్తాం

ఖైరతాబాద్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): తప్పుల తడకగా ఉన్న జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్ నివేదిక ఆధారంగా ఎస్సీ వర్గీకరణ చేస్తున్న కాంగ్రెస్, బీజేపీలపై పోరాటం చేస్తామని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య హెచ్చరించారు. మాల సమాజం తీవ్ర ఆవేదనలో ఉన్నదని, త్వరలోనే రాష్ట్ర కమిటీ సమావేశమై భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. మంగళవారం ఖైరతాబాద్ మింట్ కాంపౌండ్‌లోని అంబేడ్కర్ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో చెన్నయ్య మాట్లాడుతూ.. 2011 జనాభా లెక్కల ఆధారంగా నివేదిక ఇవ్వడంతో మాలలకు అన్యాయం జరిగిందన్నారు. మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల వెంకటేశ్వర్లు, నేతలు శ్రీనివాస్, ఆనంద్‌రావు పాల్గొన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న అరవింద్‌కుమార్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు

భారత రాజ్యాంగాన్ని కాపాడుకుంటాం

● రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్

చిక్కడపల్లి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి చిత్తశుద్ధితో, అంకితభావంతో కృషి చేస్తామని రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్‌యాదవ్ అన్నారు. మంగళవారం గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో ముషీరాబాద్ నియోజకవర్గం ఎ బ్లాక్ అధ్యక్షుడు కృష్ణ అధ్యక్షతన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ బహిరంగ సభాసమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కరపత్రాలను ఆవిష్కరించిన అరవింద్‌కుమార్ మాట్లాడుతూ భారతీయులైన మనందరం మన రాజ్యాంగాన్ని అత్యంత పవిత్రమైందిగా ప్రపంచంలోనే గొప్ప రాజ్యాంగంగా భవిస్తామన్నారు. ఇటీవల పరిణామాలు రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తూ ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో ముషీరాబాద్ నియోజకవర్గం ఎ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వి.డి కృష్ణ, మాజీ కార్పొరేటర్ కల్పనాయాదవ్, కంటెస్టెడ్ కార్పొరేటర్ జి. చంద్రకళ, రాష్ట్ర నాయకుడు, సీనియర్ అడ్వకేట్ పాశం అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఉప ఎన్నిక వస్తే ఖైరతాబాద్ టికెట్ ఇవ్వండి

● మాజీ కార్పొరేటర్ రాజుయాదవ్ పేరుతో ఫ్లెక్సీ

బంజారాహిల్స్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్‌లో ఉప ఎన్నిక వస్తే తనకు టికెట్ కేటాయించాలని కోరుతూ మాజీ కార్పొరేటర్ రాజుయాదవ్ ఏర్పాటు చేసిన బ్యానర్ చర్చనీయాంశమైంది. కాంగ్రెస్‌లో చేరిన పది మంది బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలపై సుప్రీం కోర్టులో విచారణ జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ పది మందిలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఉన్నారు. మిగతా ఎమ్మెల్యేల పరిస్థితి ఎలా ఉన్నా పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ బి ఫారంపై పోటీ చేసిన దానం నాగేందర్‌పై వేటు తప్పదని చర్చ జరుగుతున్న నేపథ్యంలో రాజుయాదవ్ ఏర్పాటు చేసిన బ్యానర్‌పై ఆసక్తికర చర్చ జరుగుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్‌లో కాంగ్రెస్ నుంచి పోటీ చేయాలని రాజు ప్రయత్నించినప్పటికీ పార్టీ అధిష్టానం విజయారెడ్డి వైపు మొగ్గు చూపించింది. ఆ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ తరఫున పోటీ చేసి విజయం సాధించిన దానం నాగేందర్ కాంగ్రెస్‌లో చేరారు. ఈ క్రమంలో బంజారాహిల్స్ కేబీఆర్ పార్కు వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేయడం పార్టీలో కలకలం సృష్టించింది. సోషల్ మీడియాలో వైరల్ కావడంతో గుర్తు తెలియని వ్యక్తులు ఫ్లెక్సీని చించివేశారు.



బంజారాహిల్స్‌లో వెలిసిన ఫ్లెక్సీ

వాటర్‌బోర్డులో పదోన్నతులు ఎప్పుడో?

● పదేళ్లుగా ఎదురుచూస్తున్న ఉద్యోగులు
● పట్టించుకోని గత ప్రభుత్వం
● సీఎం రేవంత్‌రెడ్డిపై ఆశలు పెట్టుకున్న ఉద్యోగులు

హైదరాబాద్ సిటీ, మార్చి 25(ఆంధ్రజ్యోతి): వాటర్‌బోర్డులో పదోన్నతులు లేక ఏళ్ల తరబడి ఉద్యోగులు ఎదురుచూస్తున్నారు. రిటైర్మెంట్ సమయానికి ఓ స్థాయికి వస్తామనుకున్న అంచనాలన్నీ తలకిందులయ్యాయి. గత ప్రభుత్వంలో జలమండలి బోర్డు సమావేశాన్ని పదేళ్ల పాటు చైర్మన్‌గా ఉన్న అప్పటి ముఖ్యమంత్రి నిర్వహించలేదు. వాటర్‌బోర్డుపై కనీసం సమీక్షించలేదు. ఉద్యోగుల సాధక, బాధకాలను తీర్చలేదు. అయితే పదేళ్ల తర్వాత రెండు నెలల క్రితం జలమండలి బోర్డు సమావేశాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్వహించారు. హైదరాబాద్ మహానగర తాగునీటి దాహార్తి తీర్చడానికి కీలకమైన అంశాలపై సమీక్షించారు. బోర్డు ఆమోదం పొందే విధంగా చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో వాటర్‌బోర్డు ఉద్యోగుల పదోన్నతుల అంశంలోనూ పలు సూచనలు చేశారు. దీంతో ఏళ్ల తరబడి పదోన్నతులు పొందకుండా ఎదురుచూస్తున్న వారికి అవకాశం కల్పించాలని, పదోన్నతులు కోల్పోయిన వెనుకబడిన తరగతులకు తగు న్యాయం చేయాలని సూచించారు. దీంతో ఇటీవల బోర్డులోని 40 మందికి పైగా వివిధ స్థాయిల్లోని ఉద్యోగులకు పదోన్నతులు కల్పించడానికి సూపర్ న్యూమరీ పోస్టులకు బోర్డు ఆఫ్ డైరెక్టర్లు ఆమోదముద్ర వేసినట్లు తెలిసింది. సంబంధిత దస్త్రం బోర్డు చైర్మన్‌గా ఉన్న సీఎం ఆమోదిస్తే పదోన్నతుల ప్రక్రియ ప్రారంభమవ్వనుంది. సీఎం గ్రీన్ సిగ్నల్ ఇస్తే వివిధ విభాగాల వారీగా బోర్డులోని ఉద్యోగులకు పదోన్నతులు కల్పించడంతో పాటు ఏర్పడే ఖాళీలతో మరికొందరికి పదోన్నతులు దక్కనున్నాయి. పదోన్నతుల కోసం న్యాయపరంగా ఇన్నాళ్లు కోర్టుల చుట్టూ తిరిగిన తమకు యాతన తీరుతుందని, పదోన్నతులు కల్పించాలని వాటర్‌బోర్డు ఉద్యోగులు కోరుతున్నారు. హైదరాబాద్ మహా నగర తాగునీటి దాహార్తి తీర్చడంలో కీలకంగా పనిచేస్తున్న ఉద్యోగులు పదోన్నతులతో మరింత ఉత్సాహంగా పని చేసేందుకు అవకాశాలున్నాయి.



ఖైరతాబాద్‌లోని వాటర్‌బోర్డు కార్యాలయం

విద్యుత్ ఆర్టిజన్లను కన్వర్షన్ చేయాలి

కవాడిగూడ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కమ్‌లలో పనిచేస్తున్న దాదాపు 20 వేలమంది విద్యుత్ ఆర్టిజన్స్ కార్మికులను వారివారి విద్యార్హతలను బట్టి జేఎల్‌ఎం, జేపీఏ. జూనియర్ అసిస్టెంట్, సబ్‌ఇంజనీర్, ఆఫీస్ సబార్డినేట్‌గా కన్వర్షన్ చేయాలని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ జేఏసీ చైర్మన్ ఈశ్వర్‌రావు, కన్వీనర్ ఎంఎ వజీర్‌లు కోరారు. మంగళవారం ఇందిరాపార్కువద్ద తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్‌ను కన్వర్షన్ చేయాలని డిమాండ్‌చేస్తూ జేఏసీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున సభ నిర్వహించారు. ఈ సభలో ఆర్టిజన్స్ పెద్దసంఖ్యలో పాల్గొని తమన్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈశ్వర్‌రావు. వజీర్‌లు మాట్లాడుతూ ఆర్టిజన్స్ కార్మికులను విద్యార్హతలను బట్టి కన్వర్షన్ చేయడంతో ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థిక భారం పడకపోగా కార్మికులకు ఉద్యోగభద్రత ఏర్పడుతుందని ప్రభుత్వాన్ని కోరారు. విధినిర్వహణలో సుమారు 3 వేల మంది ఆర్టిజన్ కార్మికులు మృతిచెందారని ఆవేదన వ్యక్తం చేశారు.



ఇఫ్తార్ విందుకు హాజరైన ముస్లింలతో మాజీ కార్పొరేటర్ శేషుకుమారి తదితరులు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న కాంగ్రెస్ నాయకురాలు డా. కోట నీలిమ

తెలంగాణ సర్వ మతాలకు నిలయం

● సనత్‌నగర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి నీలిమ

బేగంపేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్ డివిజన్ పరిధిలోని అశోక్‌కాలనీలో కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సనత్‌నగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డా. కోట నీలిమ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ సర్వమతాలకు నిలయమన్నారు. ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నట్లు తెలిపారు.

మాజీ కార్పొరేటర్ ఆధ్వర్యంలో..

అమీర్‌పేట, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా ముస్లింలు జరుపుకునే అత్యంత ముఖ్యమైన పండుగల్లో ఈద్-ఉల్-ఫితర్ ఒకటని అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి అన్నారు. రంజాన్ ఉపవాస దీక్షలను పురస్కరించుకుని సోమవారం రాత్రి బీకేగూడ ముస్లీం బస్తీకి చెందిన 150 మంది మహిళలకు శేషుకుమారి ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మత సామరస్యం వెల్లివిరిసేలా రంజాన్ వేడుకలు చేసుకోవాలన్నారు. బస్తీ అధ్యక్షుడు నసీరుద్దీన్ ఖాద్రి, ఉపాధ్యక్షులు షేక్ హమ్మద్, సయ్యద్ హతీక్, కోశాధికారి మహ్మద్ జహీర్ పాషా, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఇజ్రాయిల్ హత్యకు కారకులైన వారిని శిక్షించాలి



సికింద్రాబాద్ కోర్టులో నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

అడ్డగుట్ట, మార్చి 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో న్యాయవాదులకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలని సికింద్రాబాద్ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై. వసంత్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐఎస్ సదన్‌లో ప్రముఖ న్యాయవాది ఇజ్రాయిల్ దారుణ హత్యకు నిరసనగా తాము సికింద్రాబాద్ సివిల్ కోర్టులో విధులు బహిష్కరించి నిరసన ర్యాలీ నిర్వహించామన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో న్యాయవాదులకు రక్షణ లేకపోయిందని, ఇజ్రాయిల్ హత్యకు కారకులైన నిందితులను కఠినంగా శిక్షించాలని పోలీసులకు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సుశీల్ కుమార్, ఉపాధ్యక్షుడు టీవీ రమణ, సభ్యులు పుష్పలత, బుచ్చిబాబు, సౌమ్య, హిమవర్షతో పాటు సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

వీరాచారిపై ఆరోపణలకు ప్రభుత్వం స్పందించాలి



మాట్లాడుతున్న సంజీవ్

బోయినపల్లి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): భద్రాది కొత్తగూడెం జిల్లా అశ్వాపురానికి చెందిన రాగి వీరాచారిపై వస్తున్న ఆరోపణలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని తెలంగాణ పోలీస్ ఉద్యమకారుడు, ఉద్యమకారుల అభివృద్ధి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొర్గి సంజీవ్ డిమాండ్ చేశారు. మంగళవారం బోయినపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొద్దిరోజులుగా హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని హెబ్రోస్ చర్చిలో జరుగుతున్న పరిణామాలపై వీరాచారి ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. భక్తసింగ్ సొసైటీ, హెబ్రోన్ చర్చి సొసైటీలో ఎలాంటి సంబంధాలు లేకపోయినప్పటికీ వాటికి సంబంధించిన నిధులను కాజేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని అన్నారు.

బండి సంజయ్‌పై చర్యలు తీసుకోవాలి



వారాసిగూడ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ రమేష్‌గౌడ్‌కు ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్, బీఆర్ఎస్వీ విద్యార్థి విభాగం నాయకులు

బౌద్ధనగర్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌పై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్, బీఆర్ఎస్వీ నాయకులు మంగళవారం వారాసిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బౌద్ధనగర్ డివిజన్ కార్పొరేటర్ కంది‌శైలజ, బీఆర్ఎస్వీ విద్యార్థి విభాగం నాయకుడు యాద క్రాంతి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ రమేష్‌గౌడ్‌కు ఫిర్యాదు పత్రం అందజేశారు. నాయకులు సతీష్‌రెడ్డి, సాయి, అభి, హేమవర్ధన్, మురళి పాల్గొన్నారు.

విద్యావ్యాప్తికి మోదీ కృషి



చిన్నారులకు స్కూల్ బ్యాగ్‌లు పంపిణీ చేసిన బాణుక నర్మద

సికింద్రాబాద్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): విద్యా వ్యాప్తికి నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని సికింద్రాబాద్ కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యురాలు బాణుక నర్మద అన్నారు. రాష్ట్రీయ గ్రామీణ సాక్షరతా మిషన్ సహకారంతో కంటోన్మెంట్‌లోని బొలంరాయి, కార్ఖాన, మడ్‌ఫోర్టు ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం 600 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్‌ను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా నాణ్యమైన విద్యను అందించడానికి, చిన్నారులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. బీఎన్.శ్రీనివాస్, భాగ్యమ్మ, అరుణ్, మధు, హరి, వినోదా, అనురాధ, విజయలక్ష్మి, రేఖ, సబిత, వనిత, స్వాతి, నందిని, మహేశ్వరి, ప్రవీణ్, నీరజ్, పవన్, చంద్రశేఖర్, షణ్ముఖ్, రోషన్ తదితరులు పాల్గొన్నారు.

వాజ్‌పేయి సేవలు అపారం



సమావేశంలో మాట్లాడుతున్న సారంగపాణి

సికింద్రాబాద్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): దివంగత ప్రధాని వాజ్‌పేయి దేశానికి చేసిన సేవలు అపారమని బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి అన్నారు. మాజీ ప్రధాని వాజ్‌పేయి శత జయంత్యుత్సవాల ఏర్పాట్లు, వన్ నేషన్- వన్ ఎలక్షన్ ఆవశ్యకత అంశాలపై మెట్టుగూడలో మంగళవారం బీజేపీ ప్రత్యేక సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా సారంగపాణి మాట్లాడుతూ.. ఈ రెండు కార్యక్రమాలను ప్రజలందరికీ వివరించాలని, పార్టీలకు అతీతంగా అందరి మద్దతు కూడగట్టాలని కోరారు. కనకట్ల హరి, కందడి నాగేశ్వర్‌రెడ్డి, శారద మల్లేష్, రాజేష్, రవీందర్, నరేష్, నీలం శ్రీనివాస్, అంజన్న, మల్లేశ్వరపు రాజేశ్వరి, మంజుల, రామకృష్ణ, వరుణ్ యాదవ్, గోపి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాంగోపాల్‌పేట్ అధ్యక్షుడిగా సందీప్ వర్మ



కార్పొరేటర్ చీర సుచిత్రను మర్యాదపూర్వకంగా కలిసిన సందీప్ వర్మ

రాంగోపాల్‌పేట్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాంగోపాల్‌పేట్ డివిజన్ అధ్యక్షుడిగా సందీప్ వర్మ నియమితులయ్యారు. ఈ మేరకు మహంకాళి సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు భరత్ గౌడ్ సోమవారం రాత్రి సందీప్ వర్మ నియామక పత్రం అందజేశారు. మంగళవారం సందీప్ వర్మ రాంగోపాల్‌పేట్ కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సత్కరించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి



మృతి చెందిన త్రివేణి కుమారి

తిరుమలగిరి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు కింద పడి సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని మృతి చెందింది. ఈ సంఘటన తిరుమలగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై ఆంతోనియమ్మ తెలిపిన వివరాల ప్రకారం... త్రివేణి కుమారి(43) భర్త నిరంజన్, తన కుమారుడుతో కలిసి అల్వాల్ వెంకటాపురం ఎంఈఎస్ కాలనీలో ఉంటున్నారు. భర్త నిరంజన్ ప్రైవేట్ ఉద్యోగి కాగా, త్రివేణి కుమారి గచ్చిబౌలిలోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగి. రోజూ భర్త ద్విచక్ర వాహనంపై లాల్‌బజార్‌లో దింపేసి వెళ్లిపోతుంటాడు. అదేవిధంగా త్రివేణి కుమారిని భర్త మంగళవారం ఉదయం 9:50కు లాల్‌బజార్ సిగ్నల్ వద్ద దింపి వెళ్లిపోయాడు. ఆమె అక్కడి నుంచి లాల్‌బజార్ బస్‌స్టాప్‌కు నడుచుకుంటూ వెళ్లింది. ఈ క్రమంలో ఈసీఐఎల్ నుంచి వస్తున్న కంటోన్మెంట్ డిపోకు చెందిన ఎలెక్ట్రిక్ బస్సు లాల్‌బజార్ బస్‌స్టాప్‌కు వెళ్తోంది. బస్‌స్టాప్‌కు వెళ్లనున్న త్రివేణి కుమారి వెనుక నుంచి వచ్చిన బస్సు ఆమె పక్కన ఉన్న కారు ఒకే సారి కదలడంతో బస్సు ఆమెను ఢీకొంది. దీంతో బస్సు వెనక చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పర్సులో ఉన్న ఆధార్ కార్డు గుర్తింపు కార్డులతో నిరంజన్‌కు సమాచారం ఇచ్చారు. హుటాహుటినా ప్రమాద స్థలానికి చేరుకున్న నిరంజన్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఆర్టీసీ డ్రైవర్ ప్రైవేట్ డ్రైవర్ నిర్లక్ష్యం వల్లనే తన భార్య మృతి చెందిందని భర్త పోలీసులకు వివరించారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్ నరేష్, కారు డ్రైవర్ రమేష్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.

● హైదరాబాద్‌కు చెందిన ప్రవీణ్‌కుమార్‌గా గుర్తింపు



ప్రవీణ్‌కుమార్

రాజానగరం/రాజమహేంద్రవరం అర్బన్/సిటీ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ పాస్టర్ మృతి చెందాడు. ఈ సంఘటన ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధి గామన్ బ్రిడ్జి రహదారిపై కొంతమూరు నయారా పెట్రోల్ బంకు వద్ద సోమవారం రాత్రి జరిగింది. రాజానగరం సీఐ ప్రసన్న వీరయ్యగౌడ్ కథనం మేరకు... హైదరాబాద్ తిరుమలగిరి సమీపంలోని ఎస్‌బీహెచ్ కాలనీకి చెందిన పగడాల ప్రవీణ్‌కుమార్(46) అంతర్జాతీయ క్రైస్తవ వక్తగా కొనసాగుతున్నారు. హైదరాబాద్ నుంచి ద్విచక్ర వాహనంపై సోమవారం రాజమండ్రిలోని స్నేహితుడి ఇంటికి వెళ్తున్నట్టు భార్యకు చెప్పి బయలుదేరారు. సోమవారం అర్ధరాత్రి కొంతమూరు సమీపంలోని నయారా పెట్రోల్‌బంకు వద్ద అదుపుతప్పి కింద పడి మృతి చెందాడు. మంగళవారం ఉదయం సమాచారం అందడంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సీసీ కెమెరా పుటేజీలను పరిశీలించి బైక్ అతడిపై పడడంవల్లే మృతి చెందినట్టు తెలిపారు.

క్రైస్తవ సంఘాల నిరసన

రోడ్డు ప్రమాదంలో పాస్టర్ ప్రవీణ్ మృతి చెందిన ఘటనపై తూర్పుగోదావరి జిల్లాకు చెందిన క్రైస్తవ సంఘాల నాయకులు, పలువురు మతపెద్దలు, రాజకీయ నాయకులు భగ్గుమన్నారు. ప్రవీణ్‌ను ఆయన వ్యతిరేకులెవరో చంపేశారని అనుమానం వ్యక్తం చేస్తూ మంగళవారం రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రి ఎదుట రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. మూడు గంటల పాటు ట్రాఫిక్ స్తంభించడంతో పోలీసు లు ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడి ధర్నాను విరమింప జేశారు. ఈ ఆందోళనలో మాజీ ఎంపీ హర్షకుమార్, రాజేష్ మహాసేనతో పాటు తదితరులు పాల్గొన్నా రు. ఈ సంఘటనపై విచారణకు ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని జిల్లా ఎస్పీ డి.నరసింహకిషోర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

చోరీ కేసులో ఫిర్యాదు దారుడే సూత్రధారి

● 30 గంటల్లో కేసును చేధించిన బోయినపల్లి పోలీసులు
● ఇద్దరు నిందితుల అరెస్ట్



సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ గోపాలకృష్ణ, ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి

బోయినపల్లి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): పోలీస్ దుస్తులు ధరించిన ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు తనిఖీల పేరుతో ఓ సంస్థకు చెందిన ఆఫీస్ బాయి అరుణ్‌కుమార్ ఆదివారం తన బ్యాగులో తీసుకెళ్తున్న ఐదులక్షల రూపాయల నగదు దోపిడీ కేసును బోయినపల్లి పోలీసులు ఛేదించారు. ఈ దోపిడీలో ఆఫీస్ బాయ్ ప్రధాన సూత్రదారని, అతడికి వారి కార్యాలయంలో పనిచేసే అకౌంటెంట్ సమరేంద్రదాస్ పూర్తి సహకారమందించారని బేగంపేట్ ఏసీపీ గోపాలకృష్ణ తెలిపారు. మంగళవారం బోయినపల్లి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ్ రెడ్డి, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ సర్ధార్ నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. పోలీసులమని తనిఖీల పేరుతో తనవద్ద ఐదు లక్షలు ఇద్దరు వ్యక్తులు దోచుకెళ్లారని నిందితుడు అరుణ్‌కుమార్ బెహరా పథకం ప్రకారం తప్పుడు ఫిర్యాదు చేసినట్టు ఏసీపీ తెలిపారు. ఫిర్యాదు స్వీకరించిన సీఐ, డీఐలు వెంటనే అప్రమత్తమై తమ సిబ్బందితో విచారణ ప్రారంభించారని తెలిపారు. దోపిడీ జరిగిన ప్రాంతంలో ఫిర్యాదుదారుడి కదలికలను పూర్తిస్థాయిలో గమనించగా అతడే అసలు సూత్రదారిని విచారణలో తేలిందని చెప్పారు. ఈ మేరకు ఐదు లక్షల రూపాయలను రికవరీ చేసి వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుచనున్నట్టు పేర్కొన్నారు. కాగా, గతంలోను బోయినపల్లికి చెందిన సత్తు శ్రీనివాసు అనే వ్యక్తి కూడా తన ఇంట్లో మూడు తులాల బంగారం, మూడులక్షల రూపాయల నగదు, ఒక స్మార్ట్‌వాచ్ దొంగతనం జరిగిందని, తప్పుడు సమాచారం ఇచ్చి ఫిర్యాదు చేయడం జరిగిందని, దీంతో అసలు విషయం బయటపడడంతో అతను జైలుపాలు కావడం జరిగిందని ఈ సందర్భంగా ఏసీపీ గుర్తు చేశారు. 30 గంటల్లో కేసును ఛేదించిన ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి, డీఐ సర్ధార్‌నాయక్‌తో పాటు సిబ్బంది మురళి, రాజేష్, మనోహర్, శ్రీనివాస్, తుల్జారాంను ఏసీపీ అభినందించారు.

నిందితుడి కోసం 13 బృందాలతో గాలింపు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ ప్రాంతంలో ఎంఎంటీఎస్ రైలులో ఓ యువతిపై అత్యాచార యత్నానికి పాల్పడి నిందితుడి కోసం 13 బృందాలతో పోలీసులు గాలింపులు చర్యలు చేపట్టారు.

నిందితుడిని పట్టుకునేందుకు కొంత మంది అనుమానితులను జీఆర్‌పీ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. ఒక వైపు సైబరాబాద్ ఓటీసీఎస్, జీఆర్‌పీ పోలీసులు సంయుక్తంగా గాలిస్తున్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ఒక వైపు నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో సీసీ కెమెరాలు లేకపోవడంతో పోలీసులకు సవాల్‌గా మారింది. ముఖ్యంగా అల్వాల్ రైల్వే స్టేషన్‌లో సైతం సీసీ కెమెరాలు ముందు నుంచే లేవు. దీంతో దర్యాప్తునకు జాప్యం కలుగుతోంది. సికింద్రాబాద్ నుంచి గుండ్లపోచంపల్లి రైల్వే స్టేషన్‌ల మధ్య ఉన్న 14 రైల్వే స్టేషన్‌లో పోలలీసులు జల్లెడ పడుతున్నారు. ఇప్పటి వరకు 180 సీసీ కెమెరాలను పరిశీలించారు.

బాధిత యువతికి ప్లాస్టిక్, ఆర్థో సర్జరీలు

రెజిమెంటల్‌బజార్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఎంఎంటీఎస్ రైలులో అత్యాచార యత్నానికి గురైన బాధిత యువతిని సికింద్రాబాద్ యశోద ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. ప్రస్తుతం యువతి ఆరోగ్యం నిలకడగానే ఉందని తెలిపారు. బుధవారం ఆమెకు ప్లాస్టిక్ సర్జరీ, ఆర్థోపెడిక్ సంబంధించిన సర్జరీలు చేయనున్నారు.

వ్యభిచారం నిర్వహిస్తున్న ఇద్దరి అరెస్ట్

మారేడుపల్లి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): వ్యభిచారం నిర్వహిస్తున్న ఓ మహిళతో పాటు ఓ విటుడును కార్ఖానా పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... కార్ఖానా కాకాగూడ అపార్ట్‌మెంట్‌లో నైజీరియాకు చెందిన నగీయా షకీరా(31) అదే ప్రాంతానికి చెందిన ఓ మహిళతో వ్యభిచారం నిర్వహిస్తోంది. విశ్వసనీయ సమాచారమందుకున్న టాస్క్‌ఫోర్స్, కార్ఖానా పోలీసుల సహకారంతో మంగళవారం రాత్రి వ్యభిచార గృహంపై దాడి చేశారు. నగరానికి చెందిన ఓ విటుడుతో పాటు నిర్వాహకురాలిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరో మహిళను ప్రతిమా హోమ్‌కు తరలించారు. వీరి నుంచి రెండు లాప్‌టాప్‌లు, 8 సెల్ ఫోన్లు, రెండు పాస్ పోర్టులు, రూ. 1850 నగదు స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు.

అన్నానగర్‌లో కార్పొరేటర్ పర్యటన



సమస్యలపై అధికారులతో చర్చిస్తున్న కార్పొరేటర్ సామల హేమ

బౌద్ధనగర్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్ అన్నానగర్‌లో మంగళవారం అధికారులతో కలిసి కార్పొరేటర్ సామల హేమ పర్యటించారు. బస్తీలో ఉన్న నాలాలను పరిశీలించారు. స్థానిక సమస్యలపై అధికారులతో చర్చించారు. నాలాలో చెత్త వేయవద్దని, వర్షాలు కురిస్తే నాలాలో నీరు రివర్స్ వచ్చే అవకాశాలున్నాయని కార్పొరేటర్ సూచించారు. బస్తీ మహిళలు తన దృష్టికీ తీసుకొచ్చిన సమస్యలను పరిష్కారిస్తానని తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డీఈ సువర్ణ, ఏఈ కౌశిక్, నాయకులు లక్ష్మీ, శ్రీకాంత్, సాయి పాల్గొన్నారు.



అసెంబ్లీ ముట్టడికి ప్రయత్నించిన మహిళా మోర్చా నాయకురాళ్లను అరెస్ట్ చేసి మహంకాళి పోలీస్ స్టేషన్‌కు తరలించగా, వారిని పరామర్శించిన ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చీర శ్రీకాంత్
- రాంగోపాల్‌పేట్, మార్చి 25(ఆంధ్రజ్యోతి)

హుండీ ఆదాయం లెక్కింపు



రెజిమెంటల్‌బజార్‌లోని కాశీవిశ్వనాథస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.1,65,885 సమకూరినట్టు ఈవో మహేందర్ గౌడ్ తెలిపారు. మంగళవారం ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ శ్రీదేవి పర్యవేక్షణలో 5 నెలల హుండీ ఆదాయాన్ని లెక్కించారు.
- రెజిమెంటల్‌బజార్, మార్చి 25(ఆంధ్రజ్యోతి)

కల్లు కాంపౌండ్‌లో పడిపోయిన వృద్ధురాలు

● బంధువులకు అప్పగించిన పోలీసులు

తిరుమలగిరి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): నల్గొండ జిల్లా జాల సింగారం రాజాపేట్ మండల్‌కు చెందిన కుక్కల లలిత(50) అడ్డగుట్ట లోహియ నగర్‌లో ఉంటున్న తన కొడుకు అశోక్ వద్ద ఉంటోంది. కల్లుకు బానిసైన లలిత లాల్‌బజార్ కల్లు కాంపౌండ్‌లో కల్లు తాగి అక్కడే పడిపోయింది. స్థానికుల సమాచారం మేరకు ఎస్సై సంధ్యారాణి తన బృందంతో అక్కడికి చేరుకొని కల్లు మత్తులో ఉన్న వృద్ధురాలు లలితకు కౌన్సిలింగ్ ఇచ్చి సిబ్బంది చేత ఆమె కుమారుడు అశోక్‌కు అప్పగించారు.



● యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జి జి.అరవింద్ ఢిల్లీలో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డిని మంగళవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పార్లమెంట్ గెరావ్‌లో భాగంగా ఢిల్లీకి వెళ్లిన అరవింద్ ముఖ్యమంత్రిని కలిసి యూత్ కాంగ్రెస్‌ను పటిష్టం చేయడానికి కృషి చేస్తున్నట్టు సీఎంకు వివరించారు.
- తిరుమలగిరి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి)

సీఐకి ఆహ్వానం



సీఐకి ఆహ్వానం అందజేస్తున్న ఈఓ మహేందర్ రెడ్డి, టీపీసీసీ సెక్రటరీ నరసింహన్

తిరుమలగిరి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): బొల్లారం డౌటన్ బజార్‌లోని దేవాదాయ ధర్మాదాయ శాఖకు చెందిన శ్రీ హనుమాన్ ఆలయంలో ఈనెల 30న ఉగాది, వసంత నవరాత్రోత్సవాలు, ఏప్రిల్ 6న శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయం ఈఓ మహేందర్ రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి నరసింహన్ కన్నన్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జీవి బాల్‌రాజ్ తెలిపారు. ఈమేరకు మంగళవారం బొల్లారం పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌ను కలిసి ఆహ్వాన పత్రిక అందజేసినట్టు పేర్కొన్నారు. ఇన్‌స్పెక్టర్‌ను కలిసిన వారిలో అర్చకులు గోపాల్, సాయి తదితరులు ఉన్నారు.

క్రీడల అభివృద్ధికి బైసన్ పోలో గ్రౌండ్!

● సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు యోచన



బైసన్ పోలో గ్రౌండ్

సికింద్రాబాద్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్‌లోని బైసన్ పోలో గ్రౌండ్‌ను క్రీడాపరంగా అభివృద్ధి చేయాలని సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు యంత్రాంగం యోచిస్తోంది. కొద్ది రోజుల పాటు ఎన్‌సీసీ కార్యకలాపాలు, అప్పుడప్పుడూ పోలో క్రీడలు మాత్రమే సాగే బైసన్ పోలో గ్రౌండ్‌ను సద్వినియోగం చేసుకోవాలనే కోణంలో కంటోన్మెంట్ బోర్డు ఆలోచిస్తోంది. బైసన్ పోలో గ్రౌండ్ మొత్తం 33 ఎకరాల్లో విస్తరించి ఉంది. చుట్టూ దాదాపు మరో 10 ఎకరాల ఖాళీ స్థలం ఉంది. ఈ మైదానాన్ని పోలో క్రీడలకు, ఎన్‌సీసీ శిక్షణ కార్యకలాపాలకు మాత్రమే నిర్వహిస్తున్నారు. ఇవి కాకుండా పరేడ్‌గ్రౌండ్‌లో రాజకీయ పార్టీల సభలు, సమావేశాలు జరిగినప్పుడు, కైట్, స్వీట్ ఫెస్టివల్ లాంటి మెగా ఈవెంట్ల సందర్భాల్లో పార్కింగ్ కోసం ఈ మైదానాన్ని వినియోగిస్తున్నారు. కాగా, నగరం నడిబొడ్డున ఉన్న ఈ మైదానాన్ని సద్వినియోగం చేసుకునే విషయమై సికింద్రాబాద్ కంటోన్మెంట్ ముఖ్య కార్య నిర్వహణాధికారి డి.మధుకర్ నాయక్ కొద్ది రోజులుగా కసరత్తు చేస్తున్నారు. 20 ఎకరాలను పోలో క్రీడలకు, ఐదు ఎకరాలను ఎన్‌సీసీ శిక్షణ కోసం ఉపయోగించి, మిగతా స్థలంలో టెన్నిస్ తదితర క్రీడల కోసం వినియోగించాలనే అంశాన్ని సీరియస్‌గా పరిశీలిస్తున్నారు. క్రికెట్, ఫుట్‌బాల్, టెన్నిస్, బ్యాడ్మింటన్, హాకీ తదితర క్రీడలకు కేరాఫ్‌గా నిలిచే కంటోన్మెంట్‌లో సొంతంగా క్రీడా వ్యాప్తికి, క్రీడాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని యోచిస్తున్నారు. కంటోన్మెంట్ సికింద్రాబాద్ కంటోన్మెంట్ స్థలం కావడంతో బోర్డు యంత్రాంగం ప్రతిపాదనలకు రక్షణ శాఖ ఉన్నతాధికారుల నుంచి గ్రీన్ సిగ్నల్ లభిస్తోంది.

యువకుడి ఆత్మహత్య



విశాల్ శంభాజీ పటేల్ మృతదేహం

బోయినపల్లి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత కారణాలతో ఓ యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన బోయినపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... మహారాష్ట్రకు చెందిన విశాల్ శంభాజీ పటేల్ అనే యువకుడు రెండు నెలల క్రితం బోయినపల్లి క్రాస్‌రోడ్డు వద్ద మహ్మద్ ఉస్మాన్ అనే పూలవ్యాపారి వద్ద పనికి చేరాడు. సోమవారం మధ్యాహ్నం హనుమాన్ నగర్‌లో ఉన్న గోదాంకు వెళ్తొస్తానని యజమానికి చెప్పి వెళ్లాడు. ఎంతకీ రాకపోవడంతో యజమాని విశాల్‌కు ఫోన్ చేయగా, స్విచ్చాఫ్ రావడంతో పడుకున్నాడనుకొని పట్టించుకోలేదు. మంగళవారం ఉదయం గోదాంలో సామాను తీసుకురావడానికి షాపులో పనిచేసే మరో వ్యక్తి జహంగీర్ వెళ్లాడు. గోదాంలోకి వెళ్లి చూడగా విశాల్ ఐరన్ రాడ్‌కు వ్రేలాడుతూ కనిపించాడు. దీంతో జహంగీర్ వెంటనే షాపు యజామానికి తెలుపగా అతను పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడు గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకోవడానికి ప్రయత్నించగా ఫ్యాన్ విరిగిపోవడంతో అదేగదిలో ఇనుప స్టాండ్ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు.

మల్కాజిగిరి రైల్వే స్టేషన్‌లోవృద్ధుడి మృతి



వృద్ధుడి మృతదేహం

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషన్‌లో ఓ వృద్ధుడి మృతి చెందాడు. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ డేవిడ్ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మల్కాజిగిరి రైల్వే స్టేషన్‌లో ప్లాట్ ఫాం నెంబరు 2లో గుర్తుతెలియని(65) వృద్ధుడు మృతి చెంది ఉండగా సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. వృద్ధుడి ఆచూకీ తెలిస్తే సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు సమాచా రం ఇవ్వాలని పోలీసులు కోరారు.

పురోహితుల జీతాలు ఇప్పించండి



ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను కలిసి వినతిపత్రం సమర్పిస్తున్న పురోహితులు

అడ్డగుట్ట, మార్చి 25(ఆంధ్రజ్యోతి): కీసరగుట్ట శ్రీరామ లింగేశ్వర స్వామి దేవస్థాన పురోహితులకు సకాలంలో జీతాలు పెన్షన్లు రావడంలేదని పురోహితులు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను కలిసి మంగళవారం తుకారాంగేట్‌లోని ఎమ్మెల్యే నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ ఆలయంలో పనిచేస్తున్న పురోహితులకు కొంత కాలంగా జీతాలు రావడంలేదని, పదవీ విరమణ పొందిన పురోహితులకు వేతనాలు రావడంలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. తమ సమస్యలను రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సీఎం రేవంత్ దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేను కోరారు. అందుకు ఎమ్మెల్యే స్పందిస్తు పురోహితుల సమస్యలపై మంత్రి, సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

రెజిమెంటల్‌బజార్‌లో చలివేంద్రం ఏర్పాటు

రెజిమెంటల్‌బజార్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మోండా డివిజన్ రెజిమెంటల్‌బజార్‌లోని మదర్ థెరిసా విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానవ సేవే మాదవ సేవ అన్న చందంగా చలివేంద్రం ఏర్పాటుకు ముందుకొచ్చిన కాంగ్రెస్ నాయకుడు చిర్రబోయిన సంతోష్‌యాదవ్‌కు అభినందనీయమని అన్నారు. మనం సంపాదించే దానిలో కొంత సమాజానికి అందించాలన్నారు. వేసవిలో ప్రజలకు స్వచ్ఛమైన చల్లని తాగునీరు అందించాలనే సంకల్పంతో మోండా డివిజన్‌లోని ఐదు ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు సంతోష్ యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో శివ, మల్లేష్, జగ్గం మహేష్‌బాబురావు, ఆర్ది నగేష్, అల్లాడి గౌరిశంకర్, బాబురావు ముదిరాజ్, నందికంటి రవి, కేక్ శ్రీను, రాము, అజయ్ పాల్గొన్నారు.